కమిటీ నియామకం

కుత్బుల్లాపూర్, జనవరి 13 : కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పద్మానగర్‌నగర్ ఫేస్-2 ఎక్స్‌టెన్షన్-ఈస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా నియమించారు. కమిటీ నూతన సలహాదారుడిగా ఎం.బుచ్చిలింగంగౌడ్, అధ్యక్షుడిగా చిన్నరామ్ నట్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.రాజేంద్రప్రసాద్, పి.పూర్ణయ్య, పి.ఆంజనేయులు, ఎస్.మల్లారెడ్డి, కార్యదర్శులుగా పి.రవీంద్ర, సంజీవకుమార్, కె.వెంకట్‌రావు, కోశాధికారిగా బి.నాగమల్లు, సభ్యులుగా ఎం.రవి, డి.యాదగిరి, వి.అంజన్‌కుమార్ నియామకమయ్యారు.

పథకాల అమలులో కాంగ్రెస్ పురిటినొప్పులు

కుత్బుల్లాపూర్, జనవరి 13 : తెలంగాణ రాష్ట్రంలో ఆరు పథకాల పేరు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో పురిటినొప్పులు పడుతుందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, మెదక్ జిల్లా ఇన్‌చార్జి ఎస్.మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం కొంపల్లిలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో తర్జనభర్జన పడుతుందన్నారు. కుత్బుల్లాపూర్‌లో హెచ్ఎంటీ, ఐడీపీఎల్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించడంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తాను సిద్ధంగా ఉన్నానని, అధిష్టానం తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు విఘ్నేశ్వర్, సులోచన, నట్‌రాజ్‌గౌడ్, శంకర్‌రెడ్డి, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



సీఎం సహాయనిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, జనవరి 13 : అనారోగ్యాలకు గురై ఆర్థిక పరిస్థితులు బాగోలేక అవస్థలు పడుతున్న పేద ప్రజలకు సీఎం సహాయనిధి పథకం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో ఎందరో పేద ప్రజలు లబ్ధిపొందారన్నారు. మియాపూర్ డివిజన్‌కు చెందిన రాజేశ్‌కుమార్, కొండాపూర్ డివిజన్‌కు చెందిన హుస్సేనమ్మలు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిధి పథకం కింద రూ.2లక్షల ఆర్థిక సాయం మంజూరు పత్రాలను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ శనివారం తన నివాసంలో అందించారు. నిరంతర సేవలతో పేదలకు కొండంత భరోసాను ఇస్తున్నదని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా పాల్గొన్నారు.

- మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన పార్టీ సీనియర్ నాయకుడు అబీబ్, నాయినేని చంద్రకాంత్‌రావు, జహీర్ ఖాన్‌లు, నూతన సంవత్సరం ప్రజలందరికీ మంచి కలిగించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పలు డివిజన్‌లకు చెందిన పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే గాంధీని ఆయన నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గాంధీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భోగి భాగ్యాలతో ప్రతి కుటుంబం వర్ధిల్లాలని, పాడి పంటలతో తులతూగాలని ఆకాంక్షించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిది

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 13 : సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్‌లో నివసించే బి.నర్సింహమూర్తికి లక్ష రూపాయల ఎల్‌వోసీ లెటర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో ఉన్న పేదలకు ప్రభుత్వం నుంచి సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అసంబద్ధ చట్టాలు రద్దు చేయాలి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

లారీ అసోసియేషన్ డ్రైవర్లు చేపట్టిన బంద్‌కు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మద్దతును కోరుతున్న యూనియన్ సభ్యులు

కుత్బుల్లాపూర్, జనవరి 13 : కేంద్రం తీసుకొచ్చిన అసంబద్ధ ప్రజావ్యతిరేక విధానాల చట్టాలను వెంటనే రద్దు చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన న్యాయ సంహిత 106/2 హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ లారీ డ్రైవర్లు తలపెట్టిన బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఐడీపీఎల్, చింతల్ సభ్యులు శనివారం కొంపల్లిలోని తన నివాసంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేదల పొట్టకొడుతూ కార్పొరేట్లకు దోచిపెట్టే విధంగా ఒంటెద్దు పోకడలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. కార్మికులకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లారీ డ్రైవర్ల అసోసియేషన్ బీఆర్‌టీయూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, ఎండీ సయ్యద్ అసద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వినోద్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు డి.ఎల్లా కుమార్, మసూం సయీద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి చిత్తారమ్మ దేవి జాతర

ఏర్పాట్లలో నిమగ్నమైన ఆలయ కమిటీ

దుండిగల్, జనవరి 13 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రజల ఆరాధ్యదైవం, ఇలవేల్పు గాజులరామారంలోని చిత్తారమ్మ జాతర(బ్రహ్మోత్సవాలు)ను ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించనున్నది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా తొమ్మిది రోజులపాటు వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరం శివారు ప్రాంతాలతోపాటు నగరం చుట్టూ ఉన్న జిల్లాలకు చెందిన లక్షలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొని అమ్మవారి మొక్కులు చెల్లించనున్నారు. ఈనెల 19వ తేదీన మొదలు కానున్న జాతర 27వ తేదీ వరకు జరుగనున్నది. ప్రధాన జాతర ఆదివారం (ఈనెల 21న) లక్షలాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి రానుండటంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ అధికారులు, పోలీస్ యంత్రాంగంతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన పాలన అందిస్తాం

కొండాపూర్, జనవరి 13 : ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలన కొనసాగుతుందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మన్నే పల్లి సాంబశివరావు, క్రిష్ణగౌడ్, కృష్ణ యాదవ్, రహీం, సంగారెడ్డి, సాజిద్, రజాక్, మహేశ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్

డిగ్రీలతో పాటు మెరుగైన నైపుణ్యాలు తప్పనిసరి

ఇష్టాగోష్టి చర్చలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

కొండాపూర్, జనవరి 13 : విద్యార్థులు మార్కులతోపాటు మెరుగైన నైపుణ్యాలను అలవర్చుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని కేరాలోన్ గ్లోబల్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం మాదాపూర్‌లోని కెరాలోన్ గ్లోబల్ సొల్యూషన్స్ కార్యాలయంలో కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్, సింపుల్ డ్రాఫ్టింగ్ అంశాలపై ఇష్టాగోష్టి చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని, విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్న అంశాలపై చర్చించారు. గతంలో అకాడమిక్ డిగ్రీల ధ్రువపత్రాలను పరిగణలోకి తీసుకునేదని, ప్రస్తుతం అకాడమిక్స్‌తోపాటుగా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోస్ట్‌మాస్టర్స్ రీజియన్ 13 అడ్వైజర్ నితీశ్ అగర్వాల్, టాటా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్‌కి చెందిన జియోగ్రఫీ హెడ్ కపిల్ మహాజన్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ అండ్ కాగ్నిటివ్ ఇంజినీరింగ్ గ్లోబల్ హెడ్ ఆఫ్ సీఈఓ సూర్య ప్రభ వడ్లమని తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ మేయర్‌కు అభినందనల వెల్లువ

మేయర్ దంపతులను కలిసి అభినందిస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, చిత్రంలో కార్పొరేటర్ ఆగంరాజు తదితరులు

దుండిగల్, జనవరి 13 :నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నిజాంపేట్ కార్పొరేషన్‌కు రెండవసారి స్వచ్ఛసర్వేక్షణ్-2023 అవార్డు దక్కడం పట్ల పలువురు పురప్రముఖులు శనివారం బాచుపల్లి హిల్‌కౌంటీలోని మేయర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్‌గా అవతరించిన నాలుగేండ్ల కాలంలోనే రెండుసార్లు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులు దక్కడం పట్ల మేయర్ దంపతులను అభినందించడంతోపాటు పూలబొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. మేయర్ దంపతులను కలిసిన వారిలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాలు, సంక్షేమ సంఘాల నేతలు, పురప్రముఖులు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బాచుపల్లి మండలం తెలంగాణ ముదిరాజు మహాసభ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాచుపల్లి మండలం ఫిషర్మేన్ సంఘం చైర్మన్ నందిగామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ కమిటీలు అభివృద్ధికి దిక్సూచిగా నిలవాలి

బస్తీ కమిటీలు అభివృద్ధికి దిక్సూచిగా నిలవాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ అన్నారు. శనివారం ఫతేనగర్ డివిజన్ పరిధి జింకలవాడకు నూతనంగా ఎన్నికైన బస్తీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్ సతీశ్‌గౌడ్‌ను కలిశారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కార్పొరేటర్‌ను నూతన కమిటీ సభ్యులు సత్కరించగా.. నూతన కమిటీ సభ్యులను కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు ఎస్.రాములు, కార్యదర్శి సీహెచ్.బాలనర్సింహులు, రాజ్‌కుమార్, వెంకటేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

– బాలానగర్, జనవరి 13

ఓటరు నమోదుకు చివరి అవకాశం

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4.68 లక్షల ఓటర్లు
- ఈనెల 22 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రచురణ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 13 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే.. బాధ్యతగా ఒకసారి ఓటరు జాబితాను పరిశీలించాలని, ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు సూచిస్తున్నారు. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గంలో తుది ఓటరు జాబితాను రూపొందించేందుకు అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడంలో భాగంగా ఓటరు జాబితాతో ఇంటింటికీ సర్వే నిర్వహించి డూప్లికేట్ ఓట్లను తొలగించారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 ఏండ్లు నిండిన యువతీయువకులందరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో మరోసారి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నారు. ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించిన నేపథ్యంలో.. ఈ ముసాయిదా ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదో? ఒకసారి పరిశీలించాలని.. జాబితాలో పేరు లేకున్నా.. తప్పొప్పులున్నా గుర్తించి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కూకట్‌పల్లిలో 4.68 లక్షల ఓటర్లు

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం 4,68,237 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,44,969, మహిళలు 2,23,146, ఇతరులు 122 మంది ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 4,63,864 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా ప్రచురించిన ఓటరు జాబితాలో ఓటర్లు పెరిగారు. ఎన్నికలు జరిగిన తర్వాత వచ్చిన దరఖాస్తులన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చారు. అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాతో పోల్చితే ముసాయిదా ఓటరు జాబితాలో 4,373 మంది ఓటర్లు పెరిగారు. ఓటరు నమోదుకు మరోసారి అవకాశం కల్పించడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయి. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలు, ఫిర్యాదులుంటే ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్నాం.

– ఎ.రమేశ్, ఏఈఆర్‌వో, కూకట్‌పల్లి

సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరానికి అందించాలి

ముగ్గుల పోటీల కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలు

మాదాపూర్, జనవరి 13: ఆరోగ్యాన్ని, పారిశుధ్యాన్ని, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయడం అని తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ పరిధిలో బాలాజీ నిర్మల్ రత్నా అపార్ట్‌మెంట్, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పీఏ నగర్‌లలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరానికి అందించడానికి, మహిళల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. న్యాయ నిర్ణేతలుగా తాటిచర్ల వరలక్ష్మి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, చంద్రకళ, భీమమ్మ, శ్రీదేవి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మల్లేశ్, రామారావు తదితరులు ఉన్నారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తగూడ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేలా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

– కొండాపూర్, జనవరి 13

మాదాపూర్‌లోని శిల్పారామంలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా శనివారం గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరులు, కొమ్మదాసరులు, పిట్టల దొరల జానపద కళాకారూపాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం బెంగళూరుకు చెందిన విదూషి అపర్ణ శంకర్ శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్య నృత్య రూపకం, సుస్మిత మిశ్ర శిష్య బృందం ప్రదర్శించిన ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

– కొండాపూర్, జనవరి 13

అలరించిన వీణా గాన గాత్రం

మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో శ్రీ వేంకటేశ్వరస్వామి సంకీర్తనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం స్వరార్చన, నృత్యార్చన కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత శోభరాజు విద్యార్థులు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రమ్, అన్నమాచార్య అష్టోత్తర శత నామావళి, గురుస్తుతి అంశాలతో ప్రారంభించారు. కళాకారిణి జయంతి తమ వీణ గాన గాత్ర ప్రదర్శనతో అలరించారు. సంస్థ అధ్యక్షుడు, డాక్టర్ శోభరాజు కళాకారులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అన్నమయ్య సమేత వేంకటేశ్వరస్వామి వారికి మంగళహారతి అందించి ప్రసాదాలు అందజేశారు.

– మాదాపూర్, జనవరి 13

శ్రీవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం చందానగర్‌లోని విశాఖ శ్రీశారదా పీఠపాలిత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

– కొండాపూర్, జనవరి 13

గాలిపటాలు జాగ్రత్తగా ఎగురవేయాలి

సీఐ సీహెచ్.వెంకన్న

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు (పతంగులు) ఎగురవేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కోరారు. సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, అజాగ్రత్తతో ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. బిల్డింగ్‌పై ఉండి గాలిపటాలు ఎగురవేయడం ప్రమాదకరమన్నారు. గాలిపటం ఎగురవేసేటప్పుడు కండువా, దుప్పటి కప్పుకోవాలని, గోడలపై నిలబడి గాలిపటాలు ఎగురవేయొద్దన్నారు. నైలాన్, పత్తి ధారాలనే ఉపయోగించాలని, మెటాలిక్ థ్రెడ్‌ను ఉపయోగించొద్దన్నారు. గాలిపటం విద్యుత్ తీగలు, సబ్‌స్టేషన్, ప్రమాదకర ప్రదేశాల్లో చిక్కుకుంటే దానిని వదిలేయాలన్నారు. చైనా మాంజాలను ఉపయోగించడం వల్ల పక్షులకు హాని కలుగుతుందని, ఎగిరే పక్షులను చూస్తూ గాలిపటాలను ఎగురవేయాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మేలన్నారు.

మల్కాజిగిరి ఎంపీగా మాజీ మంత్రి కేటీఆర్ పోటీ చేయాలి

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్ విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్, జనవరి 13 : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి మాజీ మంత్రి కేటీఆర్ పోటీ చేస్తే అత్యధిక మెజార్టీతో గెలిచే ఆస్కారం ఉందని, ఆ దిశగా ఆలోచన చేయాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీశ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి కేటీఆర్ మల్కాజిగిరి స్థానం నుంచి పోటీ చేస్తే యువతతో పాటు ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 13 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 55, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 16, ఫ్రెంచ్ బీన్స్ 40, క్యారెట్ 32, గోరుచిక్కుడు 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 50, ఆలుగడ్డ 25, కీరా 15, దోసకాయ 23, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 50, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, చింతకాయ 35, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 60, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 25, గుమ్మడికాయ 15, నిమ్మకాయలు(12) 32 నుంచి 36, మునగకాయ(1) 10 నుంచి 12, పచ్చి బఠాని 37, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 280, అల్లం 140, వెల్లుల్లి 280, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.